గరుడ వాహన సేవ



కుత్బుల్లాపూర్: వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారిని గరుడ వాహనంపై ఊరే గించారు. కుత్బుల్లాపూర్ గ్రామ పురవీధుల గుండా రాత్రి 8గంటల నుంచి 10గంటల వరకు కొనసాగిన వాహన సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9గంటలకు హోమం బలిహరణం, స్వామివారికి అభిషేకం, రాత్రి 10గంటలకు రథోత్సవం (జాతర) ఉంటుందన్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ కోరింది.

జోర్ లగాకే హైసా..



ఆర్టీసీ బస్సు జర తోయండి బాసు!

షాపూర్‌నగర్ చౌరస్తాలో మొరాయించిన బస్సు

రంగారెడ్డినగర్: కాలం చెల్లిన పాత ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బోధన్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు షాపూర్‌నగర్ చౌరస్తాలో మొరాయించింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు స్టార్ట్ అవ్వలేదు. చివరకు ప్రయాణికులు కొంత దూరం బస్సును నెట్టడంతో ఎట్టకేలకు స్టార్ట్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పాత కాలపు బస్సులను నేటికీ కొనసాగిస్తుండటంతో అప్పుడప్పుడు రోడ్లపై ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

మొక్కల సంరక్షణకు చర్యలు



రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి డివైడర్లలో నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా వరకు డివైడర్లలో మధ్యలో నాటిన మొక్కలు ఇటీవల పెరిగిన ఎండలతో ఎండిపోయాయి. సోమవారం సర్కిల్ సిబ్బంది ఎండిన వాటిని తొలగించి కొత్త మొక్కలను నాటారు. అదే విధంగా డివైడర్ల మధ్యలో పేరుకుపోయిన కలుపు మొక్కలు, ఎండిన కొమ్మలను తొలగించి శుభ్రం చేశారు. ఓ వైపు కొంత మంది సిబ్బంది ఎండిన మొక్కలను తొలగిస్తుండగా మరికొంత మంది సిబ్బంది ట్రాక్టర్‌లో తెచ్చిన మొక్కలను నాటి నీళ్లు పోస్తుండగా 'సాక్షి'కెమెరా క్లిక్‌మన్పించింది.

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: ప్రజావాణి కార్యక్రమం సమస్యల పరిష్కారానికి చక్కటి వేదికని జంట సర్కిళ్ల ఉపకమిషనర్లు నరసింహ, మల్లయ్యలు అన్నారు. సోమవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి జరుగగా మొత్తం 15 ఫిర్యాదులు అందాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిన ప్రజావాణిలో గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్(03), యూబీడీ (01), టౌన్‌ప్లానింగ్(01), ఎలక్ట్రికల్ (01), ట్యాక్స్ సెక్షన్ (01), ఫిర్యాదులు రాగా, కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి ఇంజినీరింగ్(05), టౌన్‌ప్లానింగ్(01), ఎలక్ట్రికల్ (01), టాక్స్ సెక్షన్ (01) ఫిర్యాదు వచ్చాయని అధికారులు తెలిపారు. ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఉపకమిషనర్లు మల్లయ్య, నరసింహలు పేర్కొన్నారు.

అధికారులకు ఫిర్యాదులు..
తూతూమంత్రంగా కూల్చివేతలు



గాజులరామారం సర్వే నెంబరు 12లో నిర్మించిన గదిని నేలమట్టం చేసిన దృశ్యం

సుభాష్‌నగర్: గాజులరామారంలో ప్రభుత్వ స్థలం ఖాళీ కనబడితే చాలు కొంతమంది నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. రామారంలోని ఇందిరమ్మ కాలనీని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 12లో స్థానిక బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు రాత్రికి రాత్రి నిర్మాణం చేపట్టింది. దీంతో స్థానికులు ఈ విషయమై రెవెన్యూ అధికారుల ఫిర్యాదు చేయగా నాలుగు రోజుల క్రితం తూతూ మంత్రంగా కూల్చివేశారు. దీంతో స్థానికులు మరోసారి మాజీ ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ గదిని పూర్తిగా నేలమట్టం చేయించారు. కానీ కబ్జాకు పాల్పడిన సదరు మహిళా నాయకురాలిపై కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రిజర్వాయర్ నిర్వహణ శూన్యం

- పిచ్చి మొక్కలు పెరిగి కుంగుతున్న రిజర్వాయర్ పరిసరాలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

చింతల్: కోట్లాది రూపాయలు వెచ్చి ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన రిజర్వాయర్ల వద్ద సరైన నిర్వహణ లోపించింది. రిజర్వాయర్ల చుట్టూ పగుళ్లు ఏర్పడటంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇప్పుడు రిజర్వాయర్ నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. జలమండలి కూకట్‌పల్లి డివిజన్–9 పరిధిలోని ఫతేనగర్ సెక్షన్ పరిధిలో స్థలాభావం కారణంగా షాపూర్ నగర్‌లోని పంప్ హౌస్ పక్కన నిర్మించారు. ఈ రిజర్వాయర్ నుంచే ఫతేనగర్‌లో ఉన్న పంపింగ్ కేంద్రానికి నిరంతరం నీటిని తరలిస్తూ ఆయా బస్తీలు, కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు.

◆ అయితే కూకట్‌పల్లి డివిజన్ జలమండలి అధికారులు షాపూర్‌నగర్ పంప్ హౌస్ ఆవరణలో ఉన్న రిజర్వాయర్ బాగోగులు పట్టించుకోవడం లేదు. రిజర్వాయర్ల నిర్మాణంలో టెండర్లు దక్కించుకున్న పలు కార్పొరేట్ సంస్థలు మెయింటెనెన్స్ సుమారు మూడు నుంచి నాలుగు ఏళ్ల పాటు ఉన్నట్లు గతంలోనే జలమండలి అధికారులు ప్రకటించినా అధికారులు ఆ విషయంపై దృష్టి సారించడం లేదు. దీంతో కోట్లాది నిధులు వెచ్చించి నిర్మించిన రిజర్వాయర్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.



రిజర్వాయర్ ఆవరణలో నిలుపుతున్న తోడుపు బళ్లు

కుంగుతున్న పంప్ హౌస్ లోని ప్రాంతం..

ఫతేనగర్‌కు చెందిన ఈ రిజర్వాయర్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలం రోజురోజుకు కుంగిపోతోంది. చుట్టూ ఉన్న ప్రహరీ రిటైనింగ్ వాల్స్ నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నేడు భూమి లోపలికి కుంగిపోతోంది. రిజర్వాయర్ చుట్టూ వేసిన సిమెంట్ బెడ్డు రిటైనింగ్ వాల్ కుంగిపోవడం వల్ల రిజర్వాయర్ చుట్టుపక్కల నీరు నిలిచిపోతుంది.

ఫుట్‌పాత్ వ్యాపారుల సామాను నిల్వ ఉంచుతూ..

రిజర్వాయర్ బాగోగులు పట్టించుకోకపోవడంతో స్థానికంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు నిర్వహించుకునే వారు రిజర్వాయర్‌ను అడ్డాగా మార్చుకుంటున్నారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో తోపుడు బళ్లు, ఇతర సామగ్రిని ఉంచుతూ తమ సొంత జాగీరుగా మార్చుకుంటున్నారు.



షాపూర్‌నగర్ పంప్‌హౌస్ ఆవరణలోని కూకట్‌పల్లి డివిజన్-9 రిజర్వాయర్ పరిసర ప్రాంతం కుంగిపోయిన దృశ్యం



రిజర్వాయర్ ఆవరణలో సామగ్రి



రిజర్వాయర్ చుట్టూ పెరిగిన మొక్కలు

నేడు నీటి సరఫరా బంద్

చింతల్: గోదావరి పైప్‌లైన్ మరమత్తుల కారణంగా మంగళవారం నీటి సరఫరా నిలిచిపోనుందని సుచిత్ర సెక్షన్ మేనేజర్ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అల్వాల్ రిజర్వాయర్ నుంచి సుచిత్ర సెక్షన్ పరిధిలోనికి వచ్చే పైపులైన్ సుచిత్ర ప్రధాన రోడ్డులో నేషనల్ హైవేస్ అథారిటీ ఆధ్వర్యంలో 300ఎంఎం పైప్‌లైన్ వద్ద 400 ఎంఎం పైప్‌లైన్ జంక్షన్ పనులు చేసే క్రమంలో ఈ సరఫరా నిలిచిపోనుందని అన్నారు. పద్మానగర్ ఫేస్–2, సాయిబాబా నగర్, గాయత్రి నగర్, గోదావరి హోమ్స్, దుర్గా ఎస్టేట్, జీడిమెట్ల విలేజ్, ఎంఎస్‌రెడ్డి నగర్ ఫేస్–1, 2, వాజ్‌పేయినగర్, దత్తాత్రేయనగర్, బ్యాంక్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారానికి బదులుగా బుధవారం నీటి సరఫరా పునఃప్రారంభమవుతుందన్నారు. నీటి వినియోగదారులు సహకరించాలని సెక్షన్ మేనేజర్ శివప్రసాద్ సాక్షికి తెలిపారు.

లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల అవసరం

జగద్గిరిగుట్ట: విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమని కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖ అధికారి వి.ఆంజనేయులు అన్నారు. స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు అభ్యసించిన పాఠ్యాంశాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ ప్రవీణ్‌రెడ్డి, దయాకర్, వినోద్‌కుమార్ జాదవ్, గడ్డమీది బాలరాజ్, ఇమ్రాన్, కృష్ణ, మధు, మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు, పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన

కుత్బుల్లాపూర్: ఏడ్యూ సిస్ప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సంజయ్‌గాంధీనగర్‌లోని సాయిలతా మోడల్ హైస్కూల్‌లో సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జీడిమెట్ల ఏఎస్‌ఐ వెంకటరామిరెడ్డి, సామాజికవేత్త చికిలే మధుబాబు, ఏడ్యూ సిస్ప్ కో–ఫౌండర్ శ్రీహర్షిత చాడలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఆన్‌లైన్ ఆటలు, వాట్సాప్ స్టేటస్‌లను ఎలా వాడాలో ఉదాహరణలతో పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. ఏదైనా ఆన్‌లైన్ ఆటలు ఆడే సమయంలో వాటిలో ఇచ్చే నియమ నిబంధనలు జాగ్రత్తగా చదివాలన్నారు. అలాగే తల్లిదండ్రుల తమ పిల్లలు ఆన్‌లైన్ ఆటలు ఆడుతూ తెలియకుండానే మొబైల్‌ఫోన ద్వారా గూగుల్ పే, ఫోన్‌పే పిన్ సంఖ్యను ఉపయోగించి డబ్బులు బదిలీ చెయడం వల్ల మన డబ్బులు ఎలా నష్టపోతున్నామో ఉదహరణలతో వివరించారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ భద్రతా హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దయాకర్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



మల్లికార్జున స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్




శ్రీశైలంగౌడ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని మల్లికార్జునస్వామి జాతర మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఎమ్మెల్యే వివేకానంద్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శౌంతిరెడ్డి పున్నారెడ్డి మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాండుయాదవ్, మల్లేశ్‌యాదవ్, బాలరాజు, బాలమల్లేశ్, యాదగిరి యాదవ్, సత్యనారాయణ యాదవ్, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

– చింతల్ గణేష్ నగర్‌లోని రిడ్జి టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామలింగేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి కృషి చేయాలి



సంగీత భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని.. వారికి ఎల్లప్పుడు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అపర్ణ పామ్ గ్రూస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సంగీత భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె కమిటీ సభ్యులతో కలిసి వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ ఎన్నికలు తాత్కాలికమని అన్నారు. అభివృద్ధిలో అందరిని భాగస్వాములు చేస్తూ అందరిని కలుపుకుపోవాలని సూచించారు. కాలనీల అభివృద్ధికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గోపాలరావు, కోశాధికారి జగదీశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు బాలరాజ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తాలుకు ఇబ్బందులు

రంగారెడ్డినగర్: ఓ భవన నిర్మాణ యజమాని నిర్లక్ష్యానికి వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం తెల్లవారుజామున ఐడీపీఎల్– జగద్గిరిగుట్ట రోడ్డులో ఏపీహెచ్‌బీ కాలనీని ఆనుకుని ఓ నిర్మాణదారుడు బోరు పనులు ప్రారంభించాడు. పనులు జరుగుతున్న ప్లాట్ నుంచి బోరు వేసే క్రమంలో ప్రధాన రోడ్డుపైకి బురద పెద్ద మొత్తంలో చేరింది. ప్రతినిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు మార్గం కావడంతో అటుగా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల టైర్లు జారడంతో సర్కస్ ఫీట్లు చేయాల్సి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోర్లు వేసే క్రమంలో ఇతరులు ఇబ్బందులు పడకుండా సదరు నిర్మాణదారులు జాగ్రత్తలు తీసుకునేలా కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



బోర్ పనుల నేపథ్యంలో ఐడీపీఎల్ - జగద్గిరిగుట్ట రోడ్డుపైకి చేరిన బురద

బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి



నియామక పత్రాలు అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి, షఫియుద్దీన్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నియోజవకర్గ పరిధిలో కాంగ్రెస్ నాయకులను సేవాదళ్ అధ్యక్షులుగా నియమించారు. మేడ్చల్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు షఫియుద్దీన్, కొలన్ హన్మంత్‌రెడ్డిలు వారికి నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంగా నిర్వర్తించాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి అర్హులకు అందజేయాలని సూచించారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా జెస్సీ పాల్, ఏ బ్లాక్ అధ్యక్షుడిగా ఫలార్ రెహమాన్, బీ–బ్లాక్ అధ్యక్షుడిగా విజయ్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా పి.కిరణ్‌కుమార్, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి బాగిలి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సాయి యాదవ్, గాజులరామారం అధ్యక్షుడిగా శ్రీకాంత్, జగద్గిరిగుట్ట అధ్యక్షుడిగా రషీద్, చింతల్ అధ్యక్షుడిగా సందీప్, సూరారం అధ్యక్షుడిగా గురుమూర్తి, సుభాష్‌నగర్ అధ్యక్షుడిగా గుణశేఖర్, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, జీడిమెట్ల అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ నియమితులయ్యారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామిని దర్శించుకున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమ బలిహరణం కార్యక్రమానికి డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల వెంకటాచార్యులు, ప్రధాన అర్చకులు తిరుమల మధుసూదనాచార్యులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 160 సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్ గ్రామంలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతూ వస్తున్నాయని పేర్కొన్నారు. స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్‌సింగ్, ఠాకూర్ విజయేందర్‌సింగ్, నార్ల కంటి శ్యామ్, గార శ్రీనివాస్, కన్నా, ఊరడి మల్లికార్జున్, ముద్దాపురం సాయి తదితరులు పాల్గొన్నారు.

'స్నాక్స్ బ్రేక్‌లో ఇంటికొచ్చి ఉరేసుకున్నాడు'

టెన్త్‌లో ఎక్కడ తప్పుతాడోనని ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్న పోలీసులు



వినీత్ మృతదేహాన్ని పట్టుకుని రోధిస్తున్న తల్లి దీప

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదస్థితిలో పదో తరగతి విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన కాశీ ముత్తు, దీప దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చి గత కొన్నేళ్లుగా పద్మానగర్ ఫేజ్–02లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు వినీత్(16) స్థానికంగా రావూస్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు.

◆ సోమవారం ఉదయం తల్లిదండ్రులు, పెద్దకుమారుడు పనిలో భాగంగా బయటకు వెళ్లారు. స్కూల్‌కు వెళ్లిన వినీత్ ఉదయం 10.30 గంటలకు స్నాక్స్ టైమ్‌లో ఇంటికి వచ్చి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తరగతి గదిలో వినీత్ లేడని గుర్తించిన టీచర్ అతని ఇంటికెళ్లి చూసి రమ్మని తోటి విద్యార్థులను పంపించాడు. దీంతో స్నేహితులు వెళ్లి చూడగా వినీత్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు.

◆ ఈ విషయాన్ని స్కూల్ టీచర్‌కు చెప్పడంతో 108 వాహనంలో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాయి. చదువులో కాస్త వెనుకబడిన వినీత్ టెన్త్ పరీక్షల్లో ఎక్కడ తప్పుతాడనే ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

అసోసియేషన్ భవనం ప్రారంభం

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు బస్తీలు, కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. సోమవారం రావినారాయణరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానికంగా ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు అడ్వకేట్ కమలాకర్, కాలనీ అధ్యక్షుడు సాతాల గోపాల్, ఉపాధ్యక్షుడు పరమేష్, సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ నాగరాజు, అడ్వైజర్లు గోపీ, రాయుడు, వెంకటేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



లక్ష్మమ్మ (ఫైల్)

జగద్గిరిగుట్ట: మతిస్థిమితం సరిగ్గా లేని వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవమ్మబస్తీకి చెందిన పబ్బతి లక్ష్మమ్మ(70) ఇంటి వద్దనే ఉంటోంది. ఆమెకు కొంత కాలం నుంచి మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. కాగా సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగానే లక్ష్మమ్మ ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించ లేదు. లక్ష్మమ్మ కుమార్తె రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 3 నుంచి పల్స్‌పోలియో

- వైద్యాధికారులతో ఉపకమిషనర్ల సమావేశం
- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



సమావేశంలో పాల్గొన్న ఉపకమిషనర్ మల్లయ్య, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డా.నవనీత తదితరులు

కుత్బుల్లాపూర్: పోలియోరహిత దేశంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్‌లు నరసింహ, మల్లయ్యలు అన్నారు. మార్చి 3 నుంచి 6వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరుగనున్న పల్స్‌పోలియో వాక్సినైజేషన్ నేపథ్యంలో విధి విధానాలపై సోమవారం సర్కిల్ కార్యాలయంలో వైద్య అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది.

◆ ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పల్స్‌పోలియోను విజయవంతం చేసేందుకు జీహెచ్‌ఎంసీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ప్రాంతాల్లోని కమిటీ హాళ్లు, పాఠశాల వద్ద జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ (0–5) పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా అవగాహన కల్పించాలన్నారు.

◆ మూడు రోజుల పాటు జరిగే పోలియో వ్యాక్సినైజేషన్ స్పెషల్ డ్రైవ్‌లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో సైతం పిల్లలకు పోలీయో చుక్కలు వేయాలన్నారు. ఎవరైనా అభ్యంతరం చెబితే సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ నవనీత, వైద్యులు షహనాజ్, సౌజన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.